సాక్షి అనకాపల్లి

గురువారం ၊ 12 ၊ సెప్టెంబర్ ၊ 2024



ప్రమాద స్థాయిలో..

తాండవ, పెద్దేరు జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఇన్‌ఫ్లో పెరగడంతో నీరు విడుదల చేస్తున్నారు. 8లో



ప్రత్యేక వైద్య శిబిరాలు

దేవరాపల్లి మండలంలో జ్వరాల అదుపునకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. 8లో



హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

విశాఖ సిటీ: ఏయూ హాస్టళ్లను బుధవారం రాత్రి అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెక్టార్ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎస్సైల బదిలీ

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో 9 మంది ఎస్సైలను బదిలీ చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో నలుగురు ఎస్సైలకు పోస్టింగ్, ఐదుగురు ఎస్సైలకు బదిలీలు జరిగాయి. దేవరాపల్లిలో ఎస్సైగా ఉన్న డి.నాగేంద్రను రాంబిల్లికి, యలమంచిలి రూరల్ ఎస్సై పి.సింహాచలంను సబ్బవరానికి, నర్సీపట్నం టౌన్ ఎస్సై కె.సుందరరావును అచ్యుతాపురానికి, ఎ.కోడూరు ఎస్సై జె.రమేష్‌ను డీసీఆర్‌బీకి, అనకాపల్లి టౌన్ ఎస్సై వి.సత్యనారాయణను అనకాపల్లి రూరల్‌కు, వీఆర్‌లో ఉన్న ఎం.రామారావును పరవాడకు, బి.కృష్ణారావును పరవాడకు, జి.సత్యనారాయణను అనకాపల్లి ట్రాఫిక్‌కు, జి.ధనుంజయ్‌నాయుడును అనకాపల్లి టౌన్ ఎస్సైగా బదిలీ చేసి, పోస్టింగ్ కల్పించారు.

మెరైన్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ వర్మ



తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మెరైన్ ఎస్పీ వర్మ, ఇతర అధికారులు

పాయకరావుపేట: తీర ప్రాంతంలో ఉన్న పెంటకోట మెరైన్ పోలీసు స్టేషన్‌ను కోస్టల్ సెక్యూరిటీ (మెరైన్) ఎస్పీ పి.వి.ఆర్.ఎస్.ఎస్.ఎస్. ఆర్.వర్మ బుధవారం తనిఖీ చేశారు. తీరప్రాంత పరిరక్షణ, వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలో బందోబస్తు, అనుమానిత వ్యక్తులపై మత్స్యకారులకు అవగాహన కల్పించడం, సముద్రపు అక్రమ రవాణా అరికట్టడం వంటి విషయాలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం తీర ప్రాంతాన్ని, లైట్‌హౌస్‌ను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. తీర ప్రాంతంలో నిఘాపై సిబ్బందితో చర్చించారు. ఆయనతోపాటు మెరైన్ సీఐ బి.నారీమణి, ఎస్ఐ డి.రత్నశేఖర్, ఏఎస్ఐ కృష్ణ, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

అమరవీరులకు నివాళి



అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఎఫ్‌వో జి.లక్ష్మణ్

అనకాపల్లి: జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని అటవీ శాఖ జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ సిబ్బంది త్యాగం అందరికీ ఆదర్శమన్నారు. రేంజ్ అధికారులు చంద్రశేఖర్, లావణ్య, గౌరీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



వడ్డాదిలో రక్తదాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజున నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర పిలుపునిచ్చారు. బుధవారం రక్తదాన శిబిరం పోస్టర్లను ఆమె స్థానిక నాయకులు, యువకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ శిబిరంలో వెయ్యి మందితో రక్తదానం చేయించాలన్న ధృడ సంకల్పంతో పని చేస్తున్నామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర రక్తదాన సేకరణ కర్త బాలు కోరారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, జేఏసీ నేతలు దొండా గిరిబాబు, శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, సయ్యపురెడ్డి నవీన్, వెంకటేష్ తదితర్లు పాల్గొన్నారు.

రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 13న నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కార్యదర్శి ఎంవీడీ ఫణిరామ్ పేర్కొన్నారు. ఈ నెల 4న నిర్వహించాల్సిన సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని, తిరిగి శుక్రవారం ఉదయం 10 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు చెప్పారు.

నాటి ముందుచూపే.. రైతులకు శ్రీరామరక్ష

- జగన్ సర్కార్ హయాంలో ఫ్లడ్ వే డైవర్షన్ చానల్ నిర్మాణంతో ఏలేరుకు తప్పిన ముప్పు
- రూ.2 కోట్లతో తాండవ, వరాహ నదుల వద్ద ఏర్పాటు
- ఏలేరు ప్రవాహం పెరిగినప్పుడు వీటి ద్వారా నదుల్లోకి పంపింగ్
- నాతవరం నుంచి విశాఖ వరకూ 100 కి.మీ పొడవు ఉన్న ఏలేరు కాలువ
- భారీ వర్షం పడితే చాలు.. ఏలేరు కాలువకు గండి పడేది
- ఇప్పుడు తుపాన్లు ముంచెత్తినా కాలువకు ముప్పే లేదు

దార్శనికుడైన నాయకుడుంటే పెద్ద సమస్యలు కూడా తేలిగ్గా పరిష్కారమవుతాయి. అందుకు చక్కని ఉదాహరణ ఏలేరు కాలువ. భారీ వర్షాలు, తుపాన్లు వచ్చినప్పుడు కాలువ పరీవాహక ప్రాంతాలన్నీ ముంపు బాధతో సతమతమయ్యేవి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వరద నీటిని సమీప నదుల్లోకి మళ్లించే ఫ్లడ్ వే డైవర్షన్ చానళ్లను రెండు చోట్ల నిర్మించడంతో ఇటీవల భారీ వర్షాలు కురిసినా ఎలాంటి ప్రమాదాలు ఎదురుకాలేదు.



ఏలేరు కాలువ 66వ కిలోమీటరు వద్ద నిర్మించిన ఫ్లడ్ వే డైవర్షన్ చానల్



గత ప్రభుత్వంలో నిర్మించిన డెవర్షన్ చానల్



శరభవరం వద్ద నిండుగా ఏలేరు కాలువ

సాక్షి, అనకాపల్లి/నాతవరం: ఏలేరు కాలువ.. కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో 20 మండలాల మీదుగా సుమారు 154 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 100 కిలోమీటర్ల మీదుగా కాలువ సాగుతుంది. ప్రతి రోజూ 300 క్యూసెక్కుల నీరు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తరలిస్తున్నారు. ఈ నీటిని విశాఖ నగర ప్రజల తాగునీటికి, పరిశ్రమలకు ఉపయోగిస్తున్నారు. భారీ వర్షాలు పడితే.. ఈ కాలువ పొడవునా ఎక్కడో ఒక చోట గండి పడి సమీప గ్రామాల్లో ఆస్తి నష్టం గానీ, పంట పొలాలు మునిగిపోవడం గానీ జరిగేది. గతంలో ఈ కాలువ ప్రభావంతో చాలా సమీప గ్రామాలు మునిగిపోయిన పరిస్థితి అనకాపల్లి జిల్లాలో కనిపించేది. తుపాన్లు, భారీ వర్షాలు వస్తే ఈ కాలువ సమీపంలో ఉండే రైతులకు, ఇరిగేషన్ అధికారులకు కంటి మీద కునుకు ఉండేది కాదు. ఏ అర్ధరాత్రి సమయంలో ఎక్కడ గండి పడుతుందోననే భయం వెంటాడేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కాలువతో రైతులకు నష్టం రాకూడదనే ముందుచూపుతో రెండు ఫ్లడ్ వే డైవర్షన్ చానల్స్‌ను ఏర్పాటు చేశారు. ఒకటి తాండవ రిజర్వాయర్ దగ్గర, రెండోది వరాహ నది వద్ద నిర్మించారు. రూ.2 కోట్లతో ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. క్రాష్ బారియర్‌ను కూడా నిర్మించారు. మొదటిగా ప్రయోగాత్మకంగా ఎ.శరభవరం, రాజుపేట అగ్రహారం గ్రామాల వద్ద రూ.10 లక్షల వ్యయంతో 200 మీటర్ల మేర నిర్మించారు. మరో 1500 మీటర్ల మేర పలు ప్రాంతాల్లో నిర్మించేందుకు ప్రణాళికలను కూడా సిద్ధం చేశారు. వీటితో ఏలేరు కాలువపై ఫుట్‌పాత్ వంతెనలు, గ్రోయిన్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఆనాటి ముందు చూపే.. నేడు రైతులకు, ప్రజలకు మనోధైర్యం కల్పించింది. మొన్న కురిసిన భారీ వర్షాలకు, అంతకు ముందు నెలలో కురిసిన భారీ వర్షాలకు అనకాపల్లి జిల్లా నుంచి విశాఖ జిల్లా వరకూ ఎటువంటి నష్టం వాటిల్లలేదంటే దానికి కారణం.. ఆనాడు వైఎస్ జగన్ సర్కార్ చేపట్టిన ఏలేరు కాలువ ఫ్లడ్ డైవర్షన్ చానల్ పనులే అని చెప్పుకోవచ్చు.

వరదను దారి మళ్లిస్తారు

నాతవరం మండలంలో రాజుపేట అగ్రహారం వద్ద తాండవ నదిలోకి నీరు పోయే విధంగా, అనకాపల్లి మండలంలో శారద నదిలోకి నీరు పోయే విధంగా ఫ్లడ్ వే డైవర్షన్ చానల్స్‌ను నిర్మించారు. వీటి ద్వారా ఏలేరు కాలువలో నీటి ఉధృతి పెరిగినప్పుడల్లా.. నదుల్లోకి నీటిని విడుదల చేస్తారు. దీంతో రెండు జిల్లాల పరిధిలో ఏలేరు కాలువకు ఎక్కడా గండి పడలేదు. అలాగే గ్రామాలు ముంపునకు గురి కావడం, పంట పొలాలకు నష్టం వాటిల్లడం గానీ జరగలేదు. చానల్ నిర్మించకముందు తుపాన్లు సంభవిస్తే ఏలేరు కాలువకు గండ్లు పడేవి. లోతట్టు ప్రాంతంలో ఉన్న గ్రామాలు ముంపునకు గురయ్యేవి. ఏలేరు కాలువకు ఇరువైపుల ఉన్న వ్యవసాయ భూములు పూర్తిగా దెబ్బతినేవి. చానల్ నిర్మాణంతో ముప్పు తప్పింది.

భయం తప్పింది..



తుపాన్ల సమయంలో భారీ వర్షాలు పడేటప్పుడు ఏలేరు కాలువ నీటి వల్ల ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడేవాళ్లం. మా గ్రామంతో పాటు వ్యవసాయ భూములు సైతం ఏలేరు కాలువ దిగువ ప్రాంతంలోనే ఉన్నాయి. అనేకసార్లు కాలువ గండి పడడం మా గ్రామం ముంపునకు గురికావడం, పంట పొలాలు మునిగిపోవడం జరిగేది. అయితే గత ప్రభుత్వంలో ముప్పు తప్పించారు.

–నూతి శ్రీనివాసరావు వై.బి.అగ్రహారం

ధైర్యంగా పనిచేస్తున్నాం



ఏలేరు కాలువపై ఫ్లడ్ వే డైవర్షన్ చానల్ నిర్మాణం చేయక ముందు వర్షం పడి కాలువ ఉప్పొంగి ప్రవహించేది. తుపాన్ల సమయంలో ఏదో ఒక చోట నీటి ఉధృతికి కాలువ గండి పడడం, పంట పొలాలు, లోతట్టు గ్రామాలు ముంపునకు గురి కావడం జరిగేది. గండి పడిన చోట పనులు చేసేందుకు రూ.లక్షలు ఖర్చయ్యేవి. చానల్ నిర్మాణం వల్ల ఇపుడు ఆ సమస్య ఎదురుకాలేదు. ధైర్యంగా ఉన్నాం.

–నానాజీ, ఏలేరు కాలువ జేఈ

కలెక్టర్ పంట నష్టం పరిశీలన



శంకరం, ఆవఖండం ముంపు పొలాలను పరిశీలించిన కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంటలు ముంపునకు గురై నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. అనకాపల్లి మండలం శంకరం, విశాఖ జాతీయ రహదారి ఆనుకుని ఆవఖండంలో ముంపునకు గురైన వరి పొలాలను ఆమె బుధవారం పరిశీలించారు. వరి పొలాల్లో ముంపునకు గల కారణాలను రైతుల ద్వారా తెలుసుకున్నారు. శంకరం నుంచి ఆవఖండం, దిగువకు నీరు ప్రవహించే ప్రధాన పులికాలువలో తక్కువ నీటి ప్రవాహానికి గల అంశాలను అధికారులనడిగి తెలుసుకున్నారు. గతానికి భిన్నంగా వారం రోజుల పాటు వరిపొలాల్లో నీరు నిలిచిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువల్లో పూడికతీత, మునగపాక మండలం తోటాడ వద్ద రెగ్యులేటరీ గేట్లు సరైన సమయంలో తెరవకపోవడమే ముంపునకు ప్రధాన కారణమని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మొదటి నుంచి వాతావరణ మార్పులతో తీవ్ర వ్యయ ప్రయాసలతో ఇబ్బందులు పడ్డామని, ప్రభుత్వం ఆదుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. తోటాడ గేట్లు తెరిచేందుకు అవకాశం లేని విధంగా బిగుసుకుపోవడంపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆవఖండం లోతట్టు వ్యవసాయ భూముల్లో అనధికార లేఅవుట్లు వేయడంతో భవిష్యత్‌లో అనకాపల్లి పట్టణం, సమీప గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి జాబితా తయారు చేస్తున్నామన్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామని, పంట నష్టం తగ్గించేందుకు అధికారులు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతుల సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. జాతీయ రహదారి కింద కల్వర్టు కానాలు వెడల్పు చేయిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు, ఏడీ రామారావు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓవరాయిలింగ్ పనులు

28న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజనసభ

చోడవరం: ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టామని గోవాడ సుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2004–05 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి ఓవరాయిలింగ్ పనులను ఈనెల 12వ తేదీ నుంచి చేపడుతున్నామన్నారు. ఇందుకు సంబంధించి కార్మికులందర్నీ రీకాల్‌చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. గత సీజన్‌కు సంబంధించి రైతులకు రూ. 42.65 కోట్ల చెరకు పేమెంట్స్ ఇవ్వడం జరిగిందని, ఇంకా రూ. 7.16 కోట్లు చెల్లించాల్సి ఉందని, ఆ డబ్బులు కూడా ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని ఎండీ చెప్పారు. ఈఏడాది క్రషింగ్‌కు సంబంధించి ఇప్పటికే 10 వేల ఎకరాల్లో చెరకు అగ్రిమెంట్లు రైతుల నుంచి తీసుకోవడం జరిగిందన్నారు. ఓవరాయిలింగ్ పనులు పూర్తయిన వెంటనే క్రషింగ్ సీజన్ ప్రారంభిస్తామన్నారు. ఈ ఏడాది ఫ్యాక్టరీ సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు జరిపేందుకు నిర్ణయించామని ఎండీ చెప్పారు. ఇథనాల్ లేక డిస్టిలరీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ఎండీ సన్యాసినాయుడు చెప్పారు. రైతులంతా అగ్రిమెంటు ప్రకారం క్రషింగ్‌లో చెరకును సరఫరా చేయాలని ఆయన కోరారు.

రైలు ప్రయాణంలో ఫోన్లు జర భద్రం

- కిటికీలు, ఫుట్‌పాత్‌ల వద్ద ఫోన్‌లో మాట్లాడవద్దు
- ఫోన్ పోయినా, మరచిపోయినా రైల్వే పోలీసులకు తెలపండి
- డీఎస్పార్పీ మోహనరావు సూచన
- రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న 108 ఫోన్ల రికవరీ



ఈ–రికవరీ చేసిన ఫోన్లను యజమానులకు అందిస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) యాప్‌తో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సులభంగా రికవరీ చేయవచ్చని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్పార్పీ) మోహనరావు తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు కూడా తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చని పేర్కొన్నారు. ఇటీవల రైల్వే స్టేషన్లలో, రైలు ప్రయాణాల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న, మరచిపోయిన ఫోన్ల రికవరీకి సంబంధించి స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్‌లో బుధవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రైలు ప్రయాణాల్లో మొబైల్ ఫోన్ల విషయంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైల్వేస్టేషన్లలోని వెయిటింగ్ హాళ్లలో మొబైళ్లకు చార్జింగ్ పెట్టి, రైలు వచ్చిందన్న తొందర్లో ఫోన్లను మర్చిపోయి రైలెక్కేస్తుంటారని, రైలులో కూడా చార్జింగ్ పాయింట్లు ఉన్నందున, ప్లాట్‌ఫాంలపై చార్జింగ్ పెట్టవద్దని హితవుపలికారు. రైలు కిటికీల వద్ద, ఫుట్‌పాత్‌ల వద్ద నిలబడి ఫోన్‌లో మాట్లాడడం వలన దొంగలకు అవకాశం ఇచ్చినట్లవుతుందన్నారు. ఏదైనా పోగొట్టుకుంటే వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు. రైల్వే పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లపై సుమారు 350 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 68 మొబైళ్లను రికవరీ చేసి గతంలోనే వాటి యజమానులకు అందించామన్నారు. ప్రస్తుతం రూ.18 లక్షల విలువైన మరో 108 ఫోన్లను యజమానులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

రైతన్నకు వెన్నుపోటు

- ప్యాకేజీపై టీడీపీ నాడు అలా.. నేడు ఇలా..
- అన్యాయంపై అన్నదాతల ధర్మాగ్రహం
- కోస్టల్ కారిడార్ భూముల్లో పనులను అడ్డుకున్న నిర్వాసితులు
- వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతల మద్దతుతో ప్రతిఘటన
- వెనక్కుతగ్గిన అధికారులు



రైతులకు న్యాయం జరిగే వరకు పనులు జరగనివ్వబోమని యంత్రాల ముందు బైఠాయించిన వైఎస్సార్‌సీపీ నేతలు, నిర్వాసితులు



పోలీసులతో మహిళల వాగ్వాదం

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు కోల్పోతున్న రైతులు ఆగ్రహంతో కదం తొక్కారు. తమ డిమాండ్లు నెరవేర్చకుండానే పనులు ప్రారంభించడంతో ధర్మాగ్రహం ప్రకటించారు. చంద్రబాబు సర్కారు చేపట్టిన షెడ్లు, తాత్కాలిక వసతి సదుపాయాలు, రోడ్లు, సబ్‌స్టేషన్ వంటి నిర్మాణపు పనులను వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతల మద్దతుతో రైతులు, నిర్వాసితులు అడ్డుకున్నారు. బుధవారం 70 మంది పోలీసులతో బందోబస్తుతో చందనాడలో ఏపీఐఐసీవారి ఆధ్వర్యంలో రెండో రోజు పనులు ప్రారంభించగా.. జరగనివ్వబోమంటూ నిర్వాసితులు యంత్రాల ముందు బైఠాయించారు. బాధిత రైతులకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు ఎం.అప్పలరాజు తదితరులు అండగా నిలిచారు. మూడు గంటలపాటు రైతులకు ఏపీఐఐసీ, రెవెన్యూ, పోలీసు అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. పరిహారం ఎప్పుడో చెల్లించేశామని చెప్పడం తగదని, గత టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన విధంగా నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు రైతులను రెచ్చగొట్టి ఎందుకు ఆందోళనలు చేశారని, పనులు ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. పరిహారం చెల్లించినప్పుడు ఇంతకాలం భూములు ఎందుకు స్వాధీనం చేసుకోలేదని నిలదీశారు. రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తే పోలీసు బందోబస్తుతో పనులు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. రైతుల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని, అప్పటి వరకు పనులు జరగనివ్వబోమని, పోలీసు కేసులకు కూడా భయపడేది లేదని భీష్మించారు. కలెక్టర్ లేదా ప్రభుత్వం నుంచి బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధి వచ్చి సమాధానం చెప్పి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని రోడ్డుపై బైఠాయించారు. అప్పటివరకు పనులు వాయిదా వేయాలన్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభించిన సర్వే నెంబరు 65లో ఉన్న ప్రభుత్వ భూముల్లో చాలామంది రైతులు ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారని, వీరిలో కొంతమందికి పరిహారం ఇచ్చి అమాయకులైన వారికి, దళితులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. చివరకు అధికారులు హోం మంత్రి, కలెక్టర్ల దృష్టికి ఇక్కడ పరిస్థితిని వివరించిన అనంతరం తాత్కాలికంగా పనులను నిలిపివేస్తున్నామని ప్రకటించారు. వచ్చే మంగళవారం హోం మంత్రి, కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేస్తామని, చర్చలు కొలిక్కి వచ్చిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

హామీలు గాలికి ఒదిలేశారు..

ఏపీఐఐసీ భూసేకరణలో నష్టపోయిన రైతులకు అండగా ఉంటా. గతంలో టీడీపీ సర్కారు ఇచ్చిన హామీ మేరకు పరిహారం చెల్లించాలి. నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కరించకుండా పనులు ప్రారంభిస్తే ఆందోళన చేయక తప్పదు. పోలీసుల సాయంతో పనులు ప్రారంభించడం సిగ్గుచేటు.

– వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత

ప్రభుత్వం రైతుల్ని మోసం చేస్తోంది

రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించడం తగదు. ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులను ఆశపెట్టి ఇప్పుడు తప్పించుకోవడం తగదు. గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలి. 2013 భూసేకరణ చట్టంలో పొందుపరచిన ప్యాకేజీలన్నింటినీ చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలి. అలా కాని పక్షంలో పనులు అడ్డుకుంటాం.

–తళ్ల భార్గవ్, తిరుపతిరావు, సర్పంచ్, ఎంపీటీసీ

ప్యాకేజీ చెల్లించాల్సిందే

2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించాల్సిందే. గత పదేళ్ల నుంచి రైతుల తరపున పోరాటం చేస్తున్నాం. నిర్వాసితులు, రైతులతోపాటు, చేతి వృత్తులవారికి, బాధిత కుటుంబాల్లో మేజర్లకు కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి. ఒక పక్క రైతులతో చర్చలు జరుపుతూనే మరోపక్క పోలీసుల సాయంతో పనులు ప్రారంభించడం తగదు.


– అప్పలరాజు, సీపీఎం నాయకుడు

చందనం అలంకరణలో స్వయంభువుడు



చోడవరం: స్వయంభూ విఘ్నేశ్వర స్వామి బుధవారం చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజున స్వామి వారిని దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొండమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు



తాటిచెట్లపాలెం: బచేలి–కిరండూల్ మధ్య కురుస్తున్న భారీ వర్షాలు, భద్రతా కారణాల దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటాయి.

తిరుపతి–శ్రీకాకుళం రోడ్ స్పెషల్ రద్దు

నిర్వహణ కారణాల దృష్ట్యా తిరుపతి–శ్రీకాకుళం రోడ్–తిరుపతి మధ్య నడుస్తున్న స్పెషల్ రైళ్లు డిసెంబరు వరకు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. తిరుపతి–శ్రీకాకుళం రోడ్ (07440) స్పెషల్ అక్టోబరు 6వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు, శ్రీకాకుళం రోడ్–తిరుపతి(07441) స్పెషల్ అక్టోబరు 7వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు రద్దు చేశారు.

క్లుప్తంగా

వడ్డాది పెద్దేరు నదిలో పడి మహిళ గల్లంతు

బుచ్చెయ్యపేట: వడ్డాది పెద్దేరు నదిలో పడి జనపరెడ్డి సుబ్బలక్ష్మి(58) అనే మహిళ గల్లంతయింది. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన బుద్ధి విజయలక్ష్మి తన సోదరి సుబ్బలక్ష్మితో కలిసి పెద్దేరు నది వద్ద బహిర్భూమికి వెళ్లారు. తిరిగి వస్తుండగా తన చెల్లి సుబ్బలక్ష్మి ప్రమాదవశాత్తూ కాలు జారి నదిలో పడిపోయిందని విజయలక్ష్మి తెలిపారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోగా కేకలు వేసి గాలించినా సుబ్బలక్ష్మి ఆచూకీ కనిపించలేదన్నారు. దీంతో విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

వరద బాధితుల సాయానికి మేము సైతం...

రూ.73,270 నగదు అందించిన విద్యార్థులు



వరద బాధితులకు ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ విజయ కృష్ణన్‌కు అందిస్తున్న విద్యార్థులు

తుమ్మపాల: విజయవాడలో వరద ముంపుతో తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు విద్యార్థులు సైతం ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి గ్రామజ్యోతి సంఘం యువత, గురజాడ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి రూ.73,270 నగదును అందించారు. వారిని కలెక్టర్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

బుచ్చెయ్యపేట: మండలంలోని కొమ్మళ్లపూడిలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆరేళ్ల వయస్సు గల బాలిక మృతి చెందింది. గ్రామానికి చెందిన గొన్నా మహాలక్ష్మినాయుడు, సంతోష్‌ల కుమార్తె షర్మిల ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. సాయంత్రం గ్రామంలో ఉన్న ట్యూషన్‌కి వెళ్తుంది. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో రామాలయంలో జరుగుతున్న ట్యూషన్‌కి వెళ్లింది. ట్యూషన్ చెప్పే మాస్టారు రాకపోవడంతో స్థానిక బాలికలతో కలిసి రోడ్డు అవతల ఉన్న మాస్టారు ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వ్యాన్ షర్మిలను ఢీకొట్టి వరార్తైంది. అప్పటికే షర్మిల ముక్కు నుంచి రక్తం కారుతూ స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే పక్కనే ఉన్న రావికమతం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా బాలిక అప్పటికే మృతి చెందినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. దీంతో తల్లిదండ్రులు భోరున విలపించారు. ఈ ఘటనపై బుచ్చెయ్యపేట ఎస్‌ఐ డి.ఈశ్వరరావు విచారణ చేస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ పరిధిలో అనధికార లేఅవుట్లు 184



ప్లానింగ్ విభాగం నిర్వాకంతో వెలిసిన అక్రమ లేఅవుట్లు
ఇప్పటికే చాలా లేఅవుట్లలో సగానికి పైగా విక్రయాలు

- అక్రమ లేఅవుట్లపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ దృష్టి
- వెంటనే జాబితా ప్రకటించాలని ఆదేశం
- విశాఖలో అనుమతులు లేకుండా 20 లేఅవుట్లు
- వాటన్నింటిలో రిజిస్ట్రేషన్లు నిలిపివేత

విశాఖ సిటీ : ఒకటి కాదు.. రెండు కాదు.. వీఎంఆర్‌డీఏ పరిధిలో ఏకంగా 184 అనధికార లేఅవుట్లు ఉన్నాయట. అవన్నీ ఇప్పుడు గుర్తించినవి కాదు. చాలా కాలం క్రితమే ప్రణాళిక విభాగం అధికారులు గుర్తించారు. కానీ ఇప్పటివరకు వాటి వివరాలను బహిర్గతం చేయలేదు. ఆ విషయం తెలియక అనేక మంది ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాలో ఉన్న అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేశారు. దీనిపై మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ అనధికార లేఅవుట్లకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో మరికొన్ని అనధికార లేఅవుట్లను గుర్తించి అన్నింటి జాబితాను సిద్ధం చేశారు. వెంటనే ఆ వివరాలను ప్రకటించాలని, వాటి రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పటికే ఆ లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

అంతా 'ప్రణాళిక' ప్రకారమే..

వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ విభాగంలో అంతా 'ప్రణాళిక' ప్రకారం వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ముఖ్యంగా అనధికార లేఅవుట్ల విషయంలో అధికారుల వ్యవహార శైలి ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. నాలుగేళ్ల క్రితమే అనధికార లేఅవుట్లను గుర్తించి రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై అప్పట్లోనే అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. అక్రమంగా వెలసిన లేఅవుట్లను గుర్తించారు. అయితే వాటిని ఇప్పటి వరకు ప్రకటించలేదు. స్థల యజమానులు, డెవలపర్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ వ్యవహారంలో ప్రత్యేక 'ప్లానింగ్'తో చేతులు కలిపారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా వాటిపై ఇప్పటివరకు చూసీచూడనట్లు వదిలేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అక్రమ లేవుట్లు అన్న విషయం తెలియని కొంత మంది వాటిల్లో ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు.

చర్యలకు సిద్ధం

ఈ అనధికార లేఅవుట్లపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సీరియస్ అయ్యారు. ఇప్పటివరకు వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. వెంటనే వాటి వివరాలను ప్రకటించాలని ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో సైతం పొందుపరిచారు. అలాగే స్థల యజమానులు, డెవలపర్లపై చర్యలకు సిద్ధమవుతున్నారు. ఈ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల ద్వారా లేఅవుట్లు వేసిన డెవలపర్లకు నోటీసులు జారీ చేస్తున్నారు.

ఇందులో ప్లాట్లు కొనుగోలు చేయవద్దు



అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేయడం చట్ట విరుద్ధం. ఈ ప్లాట్ల క్రయ విక్రయాలు నిలిపివేశాం. ఇందులో ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయరు. వీటిల్లో రోడ్లు, విద్యుత్, నీరు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించరు. అనధికారికంగా లేఅవుట్లు వేసి అమ్మకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– కె.ఎస్.విశ్వనాథన్, వీఎంఆర్‌డీఏ, కమిషనర్

విశాఖలో ఆ మూడు మండలాల్లోనే..

నగరంలో మూడు మండలాల్లో అనధికార లేఅవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం మండలాల్లో 20 లేఅవుట్లలో 78.688 ఎకరాల్లో ప్లాట్లను విభజించారు. ఆనందపురంలో దబ్బంద, కుసులువాడ, గొట్టిపల్లి, పెద్దిపాలెం, వేములవలస, కోలవానిపాలెం, కణమాంలోను, భీమిలిలో బోడమెట్టపాలెం, తాళ్లవలస, మజ్జివలసలోను, పద్మనాభంలో ఏడు ప్రాంతాల్లో ఈ అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. వీఎంఆర్‌డీఏ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లుగా విభజించి గజం రూ.15 వేలు నుంచి రూ.22 వేలు వరకు విక్రయిస్తున్నారు.



లేఅవుట్లు

భారీగా ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల్లో..

ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల్లో భారీగా అనధికార లేఅవుట్లు ఉన్నాయి. ఇందులో అనకాపల్లి జిల్లాలో కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో సర్వే నెంబర్ 195/2లో 403 ఎకరాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌ను సిద్ధం చేయడం విశేషం. అదే జిల్లాలో సబ్బవరం మండలం ఆరిపాకలో 121/2లో 189.5 ఎకరాల్లో అనధికారికంగా లేఅవుట్ వేశారు. ఒక్క సబ్బవరం మండలంలోనే 42 అక్రమ లేఅవుట్లు ఉండడం గమనార్హం. అదే విధంగా పెందుర్తి, చోడవరం, నాతవరం, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, పరవాడ, నక్కపల్లి, మునగపాక, అచ్యుతాపురం, కశింకోట మండలాల్లో కూడా ఈ లేఅవుట్లు ఉన్నాయి. వీటితో పాటు విజయనగరం జిల్లాలో భోగాపురంలో 47 ఎకరాల్లోను, కొత్తవలస, పూసపాటిరేగ, ఎస్.కోట, బొండపల్లి, గంట్యాడ, జామి, లక్కవరపుకోట, వేపాడ, విజయనగరం మండలాల్లో కూడా అనేక చోట్ల అనుమతులు లేకుండా లేఅవుట్లు సిద్ధం చేశారు.

15 ఎకరాలకు పైగా వేసిన అనధికార లేఅవుట్లు

మండలం	గ్రామం	విస్తీర్ణం
కశింకోట	బయ్యవరం	403
సబ్బవరం	ఆరిపాక	189.5
వేపాడ	వేపాడ	70.86
విజయనగరం	కణపాక అయ్యన్నపేట	62.20
భోగాపురం	భోగాపురం వెస్ట్	47
కొత్తవలస	ఉత్తరాపల్లె	35.91
బొండపల్లి	కనిమెరక	31.36
గంట్యాడ	రామవరం	27.04
పాయకరావుపేట	పాయకరావుపేట	27
కొత్తవలస	చీపురువలస	19.83
సబ్బవరం	బాటజంగాలపాలెం	18.91
సబ్బవరం	సబ్బవరం	17.79
కొత్తవలస	చింతలపాలెం	17.74
వేపాడ	వేపాడ	16.92
జామి	లక్ష్మీపురం	16.9
పరవాడ	పెదముషిడివాడ	16.8
విజయనగరం	కణపాక అయ్యన్నపేట	15.81

ఇద్దరు పాత నేరస్థుల పట్టివేత

17 తులాల చోరీ బంగారం స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: అనకాపల్లి పట్టణం, పరవాడ రూరల్, విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు చోరీలకు పాల్పడిన పాత నేరస్థులను పట్టుకుని, వారి వద్ద చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ అప్పర్ రెల్లివీధికి చెందిన వడ్డాది పాలరాజు, భీమునిపట్నం చేపలుప్పాడ గ్రామానికి చెందిన చినామనా ఎల్లాజీల వద్ద నుంచి రూ.12 లక్షల విలువ చేసే 17 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ వద్ద నిందితులిద్దరూ మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న సమయంలో పరవాడ, సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు. పట్టుబడ్డ ఇద్దరూ తాళాలు వేసిన గృహాలను పరిశీలించి చోరీలకు పాల్పడుతుంటారని, పరవాడ మండలం సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన వంటాకు ఎరుకునాయుడు ఇంట్లో 2023 ఆగస్టు 27న తేదీన చోరీకి పాల్పడినట్టు పాలరాజు, ఎల్లాజీ అంగీకరించారని ఎస్పీ తెలిపారు. ఇద్దరూ పాత నేరస్తులేనని, వారి నుంచి అనకాపల్లి పట్టణం, పరవాడ, విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించిన బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సీసీఎస్ సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ రమేష్, ఏఎస్‌ఐలు కుమార్, నాయుడు, పరవాడ సీఐ మల్లికార్జునరావులను ఎస్పీ అభినందించారు.

వైఎస్ విగ్రహం చుట్టూ దిమ్మ తొలగింపు

- 13 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన విగ్రహం
- ట్రాఫిక్ నిబంధనల పేరుతో మున్సిపల్ అధికారుల చర్యలు
- కౌన్సిల్ తీర్మానం లేకుండా తొలగింపు తగదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ఆగ్రహం



మున్సిపల్ అధికారులను నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు



యలమంచిలి బస్‌కాంప్లెక్స్ ఇన్ గేటు వద్ద వైఎస్సార్ విగ్రహం



వైఎస్సార్ విగ్రహం గట్టును తొలగిస్తున్న దృశ్యం

యలమంచిలి రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ప్రధాన రహదారి పక్కన సరిగ్గా 13 ఏళ్ల కిందట నిర్మించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహంపై కూటమి నేతల కన్ను పడింది. మున్సిపాలిటీ అధికారులపై ఒత్తిడి తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా మహానాయకుడి విగ్రహం చుట్టూ వున్న దిమ్మ తొలగింపు పనులకు బుధవారం సాహసించారు. యలమంచిలి కాంప్లెక్స్ ఇన్‌గేట్‌కు సమీపంలో ఈ విగ్రహం వుంది. వాస్తవానికి ఆక్రమణలు, నిర్మాణాలు తొలగించాలంటే మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ఉండాలి. కానీ ఏ తీర్మానం లేకుండా మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణలో బుధవారం విగ్రహం చుట్టూ ఉన్న దిమ్మను తొలగిస్తుండగా పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, వార్డు కౌన్సిలర్లు దూది నర్సింహమూర్తి, పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, గొర్లి వెంకట్, చిన్ని శ్రీను, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, వైఎస్సార్‌సీపీ నేతలు పిల్లా త్రినాథ్, చిన్ని నాయుడు తదితరులు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి నోటీసులు, మున్సిపాలిటీ తీర్మానం లేకుండా దిమ్మను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. బస్‌కాంప్లెక్స్ ఇన్, అవుట్ గేట్ల వద్ద ఆక్రమణలన్నీ తొలగించాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు.


కన్నబాబు దృష్టికి ఘటన

మాజీ ఎమ్మెల్యే కన్నబాబు దృష్టికి ఈ విషయాన్ని స్థానిక నేతలంతా ఫోన్ ద్వారా తెలియజేశారు. అయితే మహానేత వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న దిమ్మ బస్సులు రావడానికి అడ్డంకిగా ఉందంటూ కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి, ప్రజా ప్రయోజనాలే వైఎస్సార్‌సీపీ పరమావధిగా భావిద్దామని కన్నబాబు స్థానిక పార్టీ నేతలకు సూచించారు. వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న గట్టులో బస్సుల రాకపోకలకు అడ్డులేకుండా నాలుగడుగులమేర తొలగించిన తర్వాత ఆర్‌సీసీ గోడ నిర్మించాలని కన్నబాబు చెప్పారు. ఈ మేరకు బుధవారం గట్టును నాలుగడుగులు కట్ చేశారు. కూటమి నేతలకు బస్‌కాంప్లెక్స్ వద్ద ఎన్నో ఆక్రమణలు ఉన్నప్పటికీ వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న దిమ్మ మాత్రమే అడ్డుగా కనిపించడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అభిప్రాయపడ్డారు.

మానసిక ఆస్పత్రిని సందర్శించిన ఆస్ట్రేలియా కాన్సులేట్

మహారాణిపేట (విశాఖ): ప్రభుత్వ మానసిక వైద్యశాలను ఆస్ట్రేలియా కాన్సులేట్ ఓస్నాట్ ఓరెన్, కౌన్సిలర్ సైద్ ముకారం హుసైనీ బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, చికిత్సా విధానాలను పరిశీలించారు. విదేశీయులకు మానసిక చికిత్స అవసరమైతే అవలంబించే విధానాలను సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ప్రమాద స్థాయిలో తాండవ నీటిమట్టం



ప్రమాద స్థాయిలో తాండవ ప్రాజెక్టు నీరు

నాతవరం: తాండవ రిజర్వాయరు నీటి మట్టం మరల ప్రమాద స్థాయికి చేరుకుంది. ఇన్‌ఫ్లో అధికంగా రావడం స్పిల్‌వే ప్రధాన గేట్ల నుంచి నీటిని నిలుపుదల చేయడంతో బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటి మట్టం 377.9 అడుగులకు చేరింది. తాండవ ప్రాజెక్టు ప్రమాదస్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా 378 అడుగులకు నీరు వచ్చే సరికి నీటిని స్పిల్ వే గేట్ల ద్వారా నదిలోకి విడుదల చేస్తారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్ ఫ్లో రోజుకు 400క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుంది. ఇదే విధంగా బుధవారం రాత్రంతా నీరు ప్రాజెక్టులోకి వస్తే గురువారం ఉదయానికి ప్రాజెక్టు నీటి మట్టం 378 అడుగులు దాటిపోతుంది. ఈ విషయంపై తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణను సంప్రదించగా తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుతుందని గురువారం ఉదయాన్నే ఆయకట్టు భూములకు ప్రధాన గేట్ల నుంచి కాలువలు ద్వారా నీటిని విడుదల చేస్తామని అన్నారు.

పెద్దేరు నుంచి 554 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్: మండలంలో రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయం (తెన్నేటి విశ్వనాథం ప్రాజెక్టు) ద్వారా బుధవారం 554 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేసినట్టు, జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు కాగా, 136.25 మీటర్లకు చేరిందని, ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయంలోకి 554 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని, చేరిన నీటిలో 534 క్యూసెక్కులు మూడో నంబరు గేటు ద్వారా, రాచకట్టు ద్వారా 10, ఆర్ఎంసీ ద్వారా 10 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశామన్నారు.

రక్షణ గోడ నిర్మాణం ఆపడం సాధ్యం కాదు

నేవల్‌బేస్ నిర్వాసితులతో ఎమ్మెల్యే విజయకుమార్



పెదకలవలాపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ,అధికారులు

రాంబిల్లి (యలమంచిలి): నేవల్ బేస్ రక్షణ గోడకు సంబంధించిన నిర్మాణ పనులు ఆపడం వీలు కాదని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ నిర్వాసితులకు స్పష్టం చేశారు. రాంబిల్లి మండలం పెదకలవలాపల్లి గ్రామంలో రక్షణ శాఖ నేవల్‌బేస్‌లో చేపడుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఎమ్మెల్యే అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. నేవల్ బేస్ రక్షణ గోడ నిర్మాణానికి వ్యతిరేకంగా గ్రామ ప్రజలు గత 314 రోజులుగా చేస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. రక్షణశాఖకు సంబంధించిన అటవీశాఖ అధీనంలో ఉన్న భూమిలోనే ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతోందని, దాదాపుగా రక్షణగోడ నిర్మాణం పూర్తవుతున్నందున నిర్మాణం ఆపడం సాధ్యం కాదని అన్నారు. నేవల్ బేస్ రక్షణ గోడ వల్ల గ్రామంలో ఉపాధి కోల్పోతున్న వారికి జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపాధికి సంబంధించిన ఆర్ కార్డులు మంజూరు చేయమని కోరుతానని అలాగే స్థానికులకు గతంలో నేవల్‌బేస్ నిర్వాసితులకు ప్రభుత్వం అందించిన పరిహారం వలే ఇచ్చేలా కోరతానని హామీ ఇచ్చారు. కాగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ నేవల్‌బేస్ అధికారులు గ్రామం సమీపంలో ఉన్న శారదానదిని కొంత మేర ఆక్రమించి గోడ నిర్మాణ పనులు చేపడుతున్నారని దీంతో వరద నీటి వల్ల గ్రామంలో పంట పొలాలు, ఇళ్ల ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రహరీ నిర్మాణం నీటి ప్రవాహాన్ని ఆపడం వల్ల గ్రామంలోకి వరద నీరు వచ్చి చేరిందన్నారు. గ్రామంలో శ్మశానవాటిక సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.

తరగతి గదిలో అపరిశుభ్రతపై జెడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం



వడ్డాదిలో వసతులపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయితీ వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఎ.సుభద్ర బుధవారం పరిశీలించారు. పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను వసతులు,విద్యా బోధన, ఇతర సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులు మధ్యాహ్న భోజనం బాగుండడం లేదని జెడ్పీ చైర్‌పర్సన్‌కు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులంతా నీట్‌గా ఉన్నా తరగతి మాత్రం అపరిశుభ్ర వాతావరణంలో ఉండడంపై సిబ్బందిపై జెడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, ప్రభుత్వ పాఠశాలలో ఉండే సామర్థ్యం, శక్తి కార్పొరేట్ పాఠశాలలో ఉండదని అన్నారు. తరగతి గదులతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటరావుకు సూచించారు. గత ఏడాది పదో తరగతిలో ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారని ఆరా తీశారు. ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన జరగాలని అన్నారు. తన ఫోన్ నంబర్ పాఠశాల నోటీస్ బోర్డు వద్ద ఉంచుతామని పాఠశాలలో ఎటువంటి సమస్య ఉన్నా సమాచారం అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ విద్యార్థులకు సూచించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు విజయ్‌కుమార్, గోపిశెట్టి శ్రీను, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ పాల్గొన్నారు.

జ్వరాల అదుపునకు ప్రత్యేక వైద్య శిబిరాలు

- డీఎంవో వరహాలదొర, డీఐవో చంద్రశేఖర్ దేవ్
- జ్వరాలపై పత్రికల్లో కథనాలపై కదిలిన అధికార యంత్రాంగం



దేవరాపల్లి పీహెచ్‌సీలో టీకాలను తనిఖీ చేస్తున్న డీఐవో చంద్రశేఖర్‌దేవ్

దేవరాపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాల అదుపునకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) కె.వరహాలు దొర, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డా. కె.చంద్రశేఖర్‌దేవ్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జ్వరాలు ప్రబలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డీఎంవో వరహాలదొరతో కూడిన వైద్య బృందం వాలాబు, గరిశింగి పంచాయతీల్లోను, డీఐవో చంద్రశేఖర్‌దేవ్‌తో కూడిన చింతలపూడితో పాటు వాలాబు పంచాయతీలో కూడా పర్యటించారు. వాలాబులో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. చింతలపూడి పంచాయతీలో పర్యటించిన అనంతరం డీఐవో స్థానిక పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకా నిల్వలను తనిఖీ చేశారు. ఇంటింటా సర్వేలో జ్వర పీడితులను గుర్తించి వైద్య సేవలందిస్తామన్నారు. జిల్లాలో మగ ఆరోగ్య కార్యకర్తలు 183 మంది పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 119 మంది మాత్రమే ఉన్నారన్నారు. 522 సచివాలయాల్లో ఏఎన్ఎంలు విధులు నిర్వర్తిస్తుండగా, మరో 173 మంది ఏఎన్ఎంలు జీఎన్ఎంగా శిక్షణ పొందుతున్నారన్నారు. మిషన్ ఇంద్ర ధనస్సు 6వ విడత కార్యక్రమానికి కార్యాచరణ చేస్తున్నామని డీఐవో తెలిపారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజ, జిల్లా వైద్యఆరోగ్య శాఖ గణాంక అధికారి ఎ.రామచంద్రరావు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, , స్టాఫ్ నర్స్ రాణి, ఫార్మసిస్టు సత్యమూర్తి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కశింకోట: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మహిళలు, హిజ్రా డ్యాన్సర్లతో ప్రదర్శనలు నిర్వహించరాదని, నిబంధనలు అధిగమిస్తే చట్ట ప్రకారం చర్యలు **తప్పవని సీఐ** అల్లు స్వామినాయుడు **హెచ్చరించారు.** అలాగే రాత్రి పది గంటల **తర్వాత డీజే సౌండ్లు** నిలిపేయాలని, ప్రజలకు **అసౌకర్యం కలి**గించరాదన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

అనకాపల్లి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై వెలువడిన తీర్పును పునఃపరిశీలించి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కార్యదర్శి గొంది అప్పారావు అన్నారు. స్థానిక గుండాల జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకూ ఏఐఎం, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ చేపట్టారు. అన్నదమ్ముల్లా ఉన్న దళితులను వేరు చేయడం సరికాదన్నారు. పలు డిమాండ్లు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏపీ నాయకులు బోగేష్, శేఖర్, వీర్రాజు, రెల్లి శ్రీను, చంద్రశేఖర్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లి : మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తున్న మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన టి.వెంకట రమణను గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ హెచ్‌సీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడ వాహనాలు తనిఖీ చేస్తుండగా పైవ్యక్తి నుంచి 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చెప్పారు.

ముఠా కార్మికులను ఆదుకోవాలి

నర్సీపట్నం: ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన ముఠా కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులైన ముఠా కార్మికులు సుమారు 300 మంది నర్సీపట్నంలో అనేక ఏళ్లుగా పనులు చేస్తూ జీవిస్తున్నారన్నారు. పన్నుల వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నా, కార్మికులకు ప్రమాద బీమా చెల్లించడం లేదన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 52 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	3,900	4,380
మూడోరకం	3,510	3,510

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	:సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	:పర్తిసాయి
సరిపోదా శనివారం	:షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
నేను కీర్తన	: శ్రీసత్య
11 డిమోంటి కాలని	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 93 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-19 యూనిట్లు, బి పాజిటివ్-33 యూనిట్లు, ఓ పాజిటివ్-32 యూనిట్లు, ఏబీ పాజిటివ్-9 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 337 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)లో సంప్రదించవచ్చు.



నిర్మాణ పనులు నిర్వహిస్తున్న కార్మికులు



కొండ వాగుపై నిర్మించిన చెక్క వంతెన



దేవదారు చెక్కలతో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ సెంటర్ షెడ్

ఆహ్లాదకరం.. నగర వనం



పగోడాల నిర్మాణం

- అటవీ అందాలు కళ్లకు కట్టేలా నిర్మాణం
- జంతువులు, మొక్కలపై అవగాహన
- ప్రకృతి అందాలు ఆస్వాదించేలా రూపకల్పన

మండలంలోని బయ్యవరం వద్ద ప్రకృతి అందాలతో కనువిందు చేసే విధంగా 'నగర వనం' **సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. అటవీ శాఖకు చెందిన రిజర్వ్ ఫారెస్టు** కొండ **ప్రాంతంలో సుమారు రూ.కోటి 30 లక్షలతో దీనిని నిర్మిస్తున్నారు.** సందర్శకులకు అవసరమైన **నదుపాయాలతో పాటు అటవీ వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా** ఈ వనం రూపుదిద్దుకుంటోంది. **అనకాపల్లి–యలమంచిలి మార్గంలో బయ్యవరం రైల్వే వంతెన వ**ద్ద జాతీయ రహదారిని **ఆనుకుని సుమారు 650 హెక్టార్ల రిజర్వు ఫారెస్టు ఉంది. దానిలో** 50 హెక్టార్లలో నగర వనం నిర్మించాలని నిర్ణయించారు. దీన్ని దఫదఫాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయిస్తూ దీనిలో భాగంగా ప్రాథమికంగా 10 హెక్టార్లలో నగర వనం అభివృద్ధి చేపట్టారు.



బయ్యవరం వద్ద నిర్మిస్తున్న నగర వనం ప్రవేశ ద్వారం

కశింకోట : అనకాపల్లి–యలమంచిలి మార్గంలో బయ్యవరం రైల్వే వంతెన వద్ద జాతీయ రహదారిని ఆనుకుని 'నగర వనం' శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. దీనిలో సందర్శకుల కోసం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడానికి, నిరీక్షించడానికి వసతులు సమకూరుస్తున్నారు. వీటన్నింటిని అటవీ వాతావరణానికి తగ్గట్టు విలువైన కలపతో నిర్మిస్తున్నారు. అటవీ శాఖ అధికారుల నిత్య పర్యవేక్షణలో వనం నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. సందర్శకులు ఉండటానికి నాలుగు పగోడాలు ఏర్పాటవుతున్నాయి. అటవీ శాఖ పని తీరుకు అద్దం పట్టే విధంగా ఎడ్యుకేషన్ సెంటర్ నిర్మిస్తున్నారు. ఇందు కోసం జమ్మూకాశ్మీర్ నుంచి దేవదారు చెక్కలను తీసుకొచ్చి పెద్ద షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. దానిలో వృక్ష సంపద, జంతువుల గురించి తెలియజెప్పే విధంగా బొమ్మల రూపంలో ప్రదర్శన ఏర్పాటు చేసి సందర్శకులకు అవగాహన కలిగించనున్నారు. అలాగే ఆహార పానీయాల కోసం క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారు. కొండ గెడ్డపై



రోజ్ వుడ్ మొక్కల పెంపకం

అడ్డంగా కర్రలతో అందంగా వంతెన నిర్మించారు. కొండ ప్రాంతంలో ప్రకృతి అందాలు వీక్షించేందుకు తాటి చెట్ల దుంగలతో డెక్ నిర్మిస్తున్నారు. టాయిలెట్ సదుపాయం కల్పిస్తున్నారు. కుటుంబాలు, స్నేహితులు, ప్రజలు గడపడానికి చెక్కలతో తయారు చేసిన బెంచీలు ఏర్పాటు చేశారు. చెట్లు, వాటి రకాలపై అవగాహన కోసం టేకు, రోజ్ వుడ్, ఎర్ర చందనం, కంబ, వెదురు, ఔషధ మొక్కలు, గార్డెన్ మొక్కలు తదితర వాటిని పెంచుతున్నారు. ఇక నడక సాగించడానికి వనం చుట్టూ దాదాపు రెండు కిలోమీటర్ల పొడవున ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. సెక్యూరిటీ గదులు నిర్మించి ప్రవేశ ద్వారాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. సందర్శలకు నామమాత్రపు రుసుంతో ప్రవేశాలు కల్పించడానికి, త్వరలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సరైన పార్కు అందుబాటులో లేదు. ప్రకృతి అందాలు ఆస్వాదించే విధంగా ఏర్పాటు చేస్తున్న నగర వనంతో ఆ లోటు తీరగలదని, ఇది ఎంతగానో ఆకట్టుకోగలదని స్థానికులతో పాటు దూర ప్రాంతాల సందర్శకులు కూడా ఆశిస్తున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మిస్తున్నాం..

బయ్యవరంలో ఉన్న రిజర్వు ఫారెస్టు భూమిలోని పది హెక్టార్లలో ప్రాథమికంగా 'నగర వనం' నిర్మాణం జరుగుతోంది. 50 హెక్టార్లలో దీన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. జిల్లా అటవీ శాఖ అధికారుల నిత్య పర్యవేక్షణలో సందర్శకులను ఆకట్టుకునే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో దీన్ని నిర్మిస్తున్నాం. వృక్ష సంపద, ఔషధ మొక్కల గురించి తెలిసే విధంగా వాటి పెంపకం చేస్తున్నాం. జాతీయ రహదారిని ఆనుకుని అనువైన వాతావరణంలో ఉండటం వల్ల ఇక్కడ దీన్ని నిర్మిస్తున్నారు.

– కాశీప్రసాద్, అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్, అనకాపల్లి



ఎర్ర చందనం మొక్కల పెంపకం



నర్సరీ మొక్కల పెంపకం



వనంలోకి దారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల : మండలంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రేబాక, కాపుశెట్టివానిపాలెం, చింతనిప్పుల అగ్రహారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ సబ్బవరం డీ–1 సెక్షన్ పరిధిలో గల కొప్పాక సబ్ స్టేషన్ 33 కేవీ/11కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ నిమిత్తం ఆయా గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కశింకోటలో రేపు..

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈ నెల 13 ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, గొబ్బూరు, చింతలపాలెం, త్రిపురవానిపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏనుగుతుని, సోమవారం, చిన ఏనుగుతుని, గొల్లగుంట, జి. భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, జోగారావుపేట, పేరంటాలపాలెం, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఏఎస్ పేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై నియంత్రణ తప్పనిసరి

అనకాపల్లి : పట్టణ, మండలంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై అధికార యంత్రంగా తనిఖీలు నిర్వహించకపోవడంతో వాటిని తిని ప్రజలు వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు చందాన కృష్ణ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టికొస్తున్నాయని, వీటి నిర్వహణపై చర్యలు లేకపోవడంతో ప్రజలు వ్యాధుల పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫాస్ట్ సెంటర్లలో రుచి కోసం టేస్టింగ్ సాల్ట్ వాడడంతో వినియోగదారులు షుగర్, బీపీ, గుండె వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. అధికార యంత్రాంగం చర్యలు తీసుకోని పక్షంలో నియోజకవర్గాల వారీగా సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ కార్యదర్శి పాలతీర్థపురాజు, సభ్యులు రేపాక బాల, శేఖర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించాలి



ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్రశేఖర్ దేవ్

కె.కోటపాడు : ఎపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్రశేఖర్‌దేవ్ అన్నారు. లంకవానిపాలెం పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రతి బుధవారం, శనివారం రోజుల్లో వ్యాధి నిరోధక టీకాలను వేసే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించే ముందు రోజునే ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది చిన్నారుల తల్లిదండ్రులకు తప్పనిసరిగా సమాచారాన్ని ఇవ్వాలని చంద్రశేఖర్ దేవ్ పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో పూర్తి స్థాయిలో మందులను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు పీహెచ్‌సీలో జరగాల్సిన అన్ని పరీక్షలను చేయాల్సిందిగా వైద్య సిబ్బందికి సూచించారు. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గణాంక అధికారి రామచంద్రరావు, వైద్యాధికారులు శైలజ, సాయికిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా క్లోరినేషన్ పనులు

మాడుగుల రూరల్ : ఇటీవల కురిసిన వర్షాల వల్ల గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, మేజర్ గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ జామి రమణబాబు పర్యవేక్షణలో వారం రోజులు నుంచి పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు బ్లీచింగ్ , క్లోరినేషన్ చేపట్టారు. బుధవారం ఫినాయిలు మురుగు కాలువల్లో పారిశుధ్య కార్మికులు పిచికారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, గుమస్తా, సాహూ పాల్గొన్నారు.

వలంటీర్ల ధర్నా



జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

అనకాపల్లి: గ్రామ, వార్డు వలంటీర్లకు బకాయి పడిన మూడు నెలల గౌరవ వేతనం తక్షణమే చెల్లించాలని, సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జగదీష్, జిల్లా గౌరవాధ్యక్షుడు రాజాన దొరబాబులు అన్నారు. స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేసి, జెడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి వలంటీర్‌కు నెలకు రూ.10 వేల గౌరవవేతనం ఇస్తామని కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చాయని, అధికారం చేపట్టి మూడు మాసాలు అవుతున్నప్పటికీ హామీ నెరవేర్చకపోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర పథకాలపై అవగాహన

మాడుగుల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, గిరిజన సంక్షేమ అధికారి నాగ శిరీష పేర్కొన్నారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా శంకరం పంచాయతీ శివారు బొడ్డేవు, కొత్తవలస గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచ్ శోలం రమేష్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 22 పథకాలను అమలు చేస్తుందన్నారు. ఎంపీపీ రాజారామ్ మాట్లాడుతూ అందరికీ విద్య, రహదారుల నిర్మాణం వంటివి అందిస్తున్నారన్నారు.

పోతనవలసలో ఆరోగ్య తనిఖీలు

కె.కోటపాడు : వర్షాకాలం కావడంతో ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలను తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. పోతనవలస గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. 119 మందికి ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

వరద బాధితులకు వితరణ

మాడుగుల రూరల్ : విజయవాడ వరద బాధితులకు కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూలు కమిటీ చైర్మన్, సభ్యులు తమ వంతుగా ఆర్థిక సహాయం అందించారు. బుధవారం వీరంతా కలిసి రూ.10,902 నగదు సహాయం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించడానికి హెచ్‌ఎం వి.దాసు, స్కూలు కమిటీ చైర్మన్ కర్రి సంతోష్‌కు సంబంధిత నగదు అందజేశారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న సీడీపీవో ప్రభావతి

అనకాపల్లి : పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాయని, పది మంది మహిళలు విధులు నిర్వహిస్తున్న చోట నలుగురితో ఒక కమిటీని కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు సీడీపీవో ప్రభావతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం–2013 అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, దేశంలో మహిళలకు ఎక్కడ గౌరవం ఉంటుందో ఆ ప్రాంతానికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో శశికళ, ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఎంఈవో–2 జి.కోటేశ్వరరావు, ఈవోఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి కార్మిక సంఘం అండగా నిలిచింది. రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకుంది. సీఐటీయూ అనుబంధంగా ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుడు మండపాక శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి సంఘం తరపున సభ్యులు సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి నిలిపేసిన పథకాలను పునరుద్ధరించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించి భవన నిర్మాణాలను ప్రోత్సహించడం ద్వారా కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పి.మహేష్, కె. రాంబాబు, బి.నాగేశ్వరరరావు, పి. అప్పారావు, టి. సూరిబాబు, ఎస్. నానాజీ, డి. శివ తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెం యూపీహెచ్‌సీ పరిశీలన



ఆస్పత్రిలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న వైద్యుడు బాలకృష్ణ తదితరులు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం అరుంధతీనగర్ యూపీహెచ్‌సీని నేషనల్ క్వాలిటీ ఎక్యూర్డ్ స్టాండర్డ్ వైద్యుల బృందం బుధవారం సందర్శించింది. రోగులకు అందుతున్న సేవలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేషెంట్లు, ఇటీవల వాతావరణ మార్పులతో విషజ్వరాలతో ఎంత మందికి చికిత్స అందిస్తున్నారు, రికార్డుల పరిశీలన, మందులు, ఇంటింటి సర్వే తదితర అంశాలపై బృందంలోని వైద్యులు బాలకృష్ణ, రమణస్వాతి, వామన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నివేదికను ఢిల్లీ వైద్య బృందానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుడు జయదేవ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రమేష్

కశింకోట : పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ కోరారు. మండలంలోని అచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త హీనత నివారణకు పోషక విలువలు కలిగిన తాజా ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, తాళ్లపాలెం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత, ఎంపీహెచ్‌ఎస్ కె.జి. నరసింహారావు, అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ కమలాదేవి, ఏఎన్ఎం ఎస్.ధనలక్ష్మి, సీహెచ్‌వో ఎం.శ్యాం, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఈలపాట



ఈలపాటలతో అలరిస్తున్న విజయబాబు

కశింకోట : స్థానిక అగ్రహారం వీధిలో బుధవారం రాత్రి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ విజేత పులఖండం విజయబాబు (అనకాపల్లి) ఆలపించిన ఈల పాటలు ఆహూతులను అలరించాయి. వర సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కీర్తనలు, నర్తనశాల సినిమాలో పాటలను విజయబాబు తన ఈల పాట ద్వారా ఆలపించి రజింపజేశారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాల వేసి, దుశ్శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి నిర్వాహకులు సత్కరించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక



గాదిరాయి నుంచి ఆస్పత్రికి బస్సు ద్వారా రోగులను తరలిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : దీర్ఘకాలిక రోగులు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారిని శస్త్ర చికిత్సల నిమిత్తం విశాఖ సమీపంలో గల అనిల్ నీరుకొండ ఆస్పత్రికి బుధవారం తరలించారు. కె.జె.పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, వీహెచ్‌పీ సారథ్యంలో బుధవారం వీజేపురం, ఒమ్మలి, గాదిరాయి, ముకుందపురం, వంటర్లపాలెం గ్రామాల నుంచి 52 మందిని అనిల్‌నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. కళ్లు, మూల వ్యాధి, గుండె సమస్య, స్త్రీల సమస్యలతో బాధపడుతున్న వారిని తరలించారు. ఈ కార్యక్రమంలో భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు రామకొండలరావు, వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు కరణం దేముళ్లు, పడాల శ్రావణి, శనివాడ అప్పల నర్సింహనాయుడు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు. శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించి, వారికి ఉచిత భోజన సదుపాయం, రవాణా సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్టు రామకొండలరావు తెలిపారు.

సోషల్ ఆడిట్ పారదర్శకంగా జరగాలి

దేవరాపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్)ను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అధికారులతో ఉపాధి హామీ పథకం 17వ సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశాన్ని ఎంపీపీ బుల్లిలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో మాడుగుల క్లస్టర్ ఏపీడీ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 ఆగస్టు వరకు జరిగిన పనులకు సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు. ఎంపీడీవో కె.చంద్రశేఖర్, ఏపీవో డి.చంద్రకళ, హౌసింగ్ ఏఈ భవ్యతేజ, ఎస్ఆర్పీడి.రాజేంద్రరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు నర్సులను క్రమబద్ధీకరించాలి



ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నర్సులు

చోడవరం రూరల్: ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో 115ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సామాజిక ఆస్పత్రిలో కాంట్రాక్టు నర్సులు బుధవారం నిరసన చేపట్టారు. కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.నీరజ మాట్లాడుతూ జీవో నంబర్ 115 ప్రకారం రెగ్యులర్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ స్టాఫ్‌నర్స్‌లుగా నియమించడానికి వీలు కల్పించిందన్నారు. దీంతో ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్‌నర్సులుగా విధులు నిర్వహిస్తున్న వారికి నష్టం వాటిల్లుతుందన్నారు. తక్షణం జీవోను రద్దు చేసి కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. నిరసనలో రమాదేవి, రేవతి, గంగాభవాని, రత్నం, గీత, క్రాంతి, నూకరత్న పాల్గొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సహాయ అధ్యక్షుడు శంకరరావు, హెడ్ నర్స్ జయంతి సంఘీభావం తెలిపారు.